ఆ రెండు ఆలయాలకు మధ్య పెద్ద దూరం లేదు. కానీ, ఆ రెండు ఆలయాలు కట్టించిన యిద్దరు వ్యక్తుల మధ్య అంతస్థుల తేడా. ఆఖాతాల దూరం. మహాలక్ష్మి గుడిని లక్ష్మీ వరప్రసాదుడు కట్టించాడు. అందులో దేవి పాలరాతితో, బంగారు, వెండి నగలతో ధగ ధగ మెరుస్తోంది.

ఇటు చిన్న పాకలాంటి గుడిలో ఆంజనేయస్వామి. నల్లరాయి నిండుగా యెర్రని పెయింట్ బూసిన స్వామి లక్ష్మీదేవి పూజారి జీతగాడు ఇక్కడ గుడిని ప్రతిష్ఠించినవాడే పూజారి ఆ పెయింట్ రంగు యెర్రని పంచెకట్టి వున్నాడు. ఈ పంచె పట్టు పంచె కావడంవల్ల దానికి విలువ వచ్చింది. పూజారి కళ్ళు కూడా యెరుపు రంగే. అంతేకాదు యీ గుడిమీద యెగురుతున్న జండాలూ యెర్ర జెండాలే!

# హనుమాన్ సాక్షి

## బలివాడ కాంతారావు




ఈ యెర్ర జెండాలు చూసి యీ చుట్టుపట్లనున్న వాళ్ళు దేమనుకుంటే నమ్మని వాళ్ళని అనుకోగలరు? రోడ్డుకు రెండు వేపుల నూరికిపేట. పేట మొదట్లో - కాదు మధ్యలో—రోడ్డు వార యీ హనుమానుల వారు వెలశారు. చుట్టూ పాతిక దుగుల జాగాలో వర్షాకాలంలో తప్పించి, మిగతా కాలాల్లో రాత్రి ఒకరి నొకరు అంటుకుని యెందరో పడుకుంటారు. గుడిపైన రాత్రంతా లైటు వెలుగుతుంటుంది. మేకల అరుపులతోపాటు, ఆవుల అంబా అన్న స్వరాలు వినిపిస్తాయి. దోమల సంగీతం. రోడ్డువారే దుకాణాలు. ఈ దుకాణాల్లో కుళ్ళిపోబోతున్న వస్తువులు దొరుకుతాయి. సాయంత్రమైతే రోడ్డంతా మనుషులూ, పశువులూ ఆక్రమించుకోవటం వల్ల యే వాహనం బ్రేకులు వేసుకోకుండా పోలేదు. చేపలు ముమ్మరంగా పడుతున్న రోజుల్లో, కుళ్ళిన వేరుశెనగ గింజంత ఈగలు మందలు మందలుగా వచ్చి మీద పడుతుంటాయి.

ఇవన్నిటికీ సాక్షి యెవరు? హనుమాన్. ఈ కష్టాలన్నీ భరిస్తున్న మనుషులు ఈ హనుమాన్‌ని సాక్షిగా పెట్టి ఏం చేస్తున్నారు?

కొత్తగా పెళ్ళి చేసుకున్న ఒక జంట స్వామి ఆశీర్వాదం అందుకోడానికి వచ్చేరు. ఆ ముసి ముసి నవ్వులు, ఆ వాలు కళ్ళల్లో ఆశలు అంతా రాజయ్య చూశాడు. వాళ్ళు స్వామివారిని సాక్షిగా పెట్టి ఎన్నో ప్రమాణాలు తీసుకున్నారు. ఒకరితో ఒకరు కలిసి మెలిసి ఒక్క జంటగా మెసలుతామన్నారు. అదే పనిగా స్వామిని కొలుస్తున్నవాళ్ళను ఆశీర్వదించే హక్కును స్వామివారికి వదలకుండా తనే తీసుకున్నాడు— దురదృష్టం అంతా పేదవాళ్ళదేనని నమ్మిన రాజయ్య.

వాళ్ళు వెళ్ళాక గుమ్మంమీద కూర్చొని లోన విగ్రహంవేపు చూశాడు. ఆ కొండవార యెన్నాళ్ళనించో యెండకు యెండి వానకు తడిసిన రాయి. యెందరో యెక్కి తొక్కిన రాయిని యీ విగ్రహంగా తన చేత్తోనే చెక్కాడు. ఇందులో యేం మహత్యం వుంటుంది? వీళ్ళందరినీ ఈ దేముడి పేరు చెప్పయినా ఒక తాటిలో నడిపిద్దామని పెత్తే యీ గుడి దగ్గరకు యిలాంటి అలాంటి వాళ్ళు వస్తున్నారా?

ఇక్కడే యీ స్వామివారికి మొక్కి ఈ జాగాలోనే అతన్ని సాక్షిగా పెట్టి తను పదవికి వస్తే ఈ మురికిపేటలో కొళాయిలూ మరుగుదొడ్లు కట్టిస్తానని ప్రతిజ్ఞ చేసి ఉపన్యాసం యిచ్చిన రాజకీయ నాయకుడు,

ఇక్కడ నిరుపేదలున్నారు. రోగాలతో బాధపడుతున్నారు. వీళ్ళ సేవకు అంకితం యీ రోజునించి అవుతున్నానని స్వామివారికి మొక్కి అతన్నే సాక్షిని చేసి ఒక చిన్న డిస్పెన్సరీ తెరిచిన డాక్టరు,

“నా కూతురికి వేగంగా ఒక సంబంధం వచ్చేటట్లు చూడ”ని పళ్ళూ పువ్వులూ తెచ్చి పూజించిన తల్లి,

“ఈ రోజుకి యెలాగో గడిచిందిస్వామీ రేపటికి తిండి నువ్వే పెట్టు” అన్న వాళ్ళెందరో! ఇలాంటివాళ్ళను చూడటం వలన ఈ ప్రదేశంమీద రాజయ్యకు మమకారం ఇంకా పోలేమ్మ.

ఒక సాయంత్రం ఒక విశేషం జరిగింది. ఒక నల్లని కారు. ఏ దేశం నుంచో కొత్తగా దిగుమతైన కారు. కారు మెరిసిపోతోంది. కారులోనించి దిగిన స్త్రీ శరీరం కూడా మెరుపులా మెరిసిపోతోంది. ముప్ఫయి దాటినా మధురంగా వుంది. చిక్కితే రక్తం వస్తుంది. కట్టిన చీరే నగలంత నాణ్యమైనది. ఆవిడను చూసి అప్పటికి స్వామివారి ఆలయ మండపంలో వున్న భక్తులందరూ పక్కకు తప్పుకున్నారు. ఆమె వెండి పళ్ళెం నింపుగా పూజా ద్రవ్యాలు తెచ్చింది.


రాజయ్యకు తెలుసు. ఈమె భర్తే ఆ దోపిడిదారు. రోజుకు వంద అబద్ధాలాడి లక్షలు సంపాదించాడు. ప్రజల కళ్ళు కప్పడానికి భక్తుడై లక్ష్మీదేవి ఆలయం కట్టించాడు. ఆ ఆలయంకి వెళ్ళకుండా నిత్యం అసహ్యించుకున్న యీ మురికికూపంలోనికి యెందుకొచ్చిందో? ఆ సంపన్న దేవత కోరిన కోరికలన్నీ ప్రసాదించలేదేమో?

ఆ రాత్రి ఆలోచిస్తుంటే రాజయ్యకు యీనాడే కొంత తృప్తి కలిగింది. ఆ సుందరరావు కొలువులో వుండి వాడి అన్యాయాలను యెదుర్కోబోతే. తనకు వుద్వాసన చెప్పాడు. తనలా వాడి అన్యాయాలకు ఆహుతైనవాళ్ళను ఒక తాటిలో నడిపించి తిరుగుబాటు లేవదీయలేకపోయాడు. ఈ ప్రజ తమ బాధలు భరిస్తారుగానీ, ఆ బాధను యెవరు కలుగజేస్తున్నారో వాడి అంతు చూస్తామనరు! వీళ్ళకి జగడాలక్కర్లేదు. పోరాటం వద్దు. అంతా సునాయాసంగా జరిగిపోవాలి. లాటరీలో డబ్బు వచ్చినట్లు దేముడికి మొక్కగానే సుఖం వచ్చేయాలి. ఒక రాయి రప్పని దేముడి బొమ్మగా నిలబెట్టితే వీళ్ళ గౌరవం పొందవచ్చుగానీ, నిజం పలికి ధీరులు కమ్మంటే యెవరూ తన మాట వినరు. మొదట ఈ మ్యునిసిపల్ జాగాలో యీ ఆంజనేయులవారిని ప్రతిష్ఠించకపోతే యీ వెయ్యి జనాభా వున్న యీ పేట ఒక అందమైన పార్కుగా ఆ మేడల్లోనున్న మహారాజుల కంటికి యింపుగా కనిపించేది ఆశీర్వాదాలు తనే దేముడనుకుని అందజేస్తున్నాడు వెకిలి నవ్వుతో.

ఇంకా ఈ వెకిలి నవ్వు పెరగడానికి కారణం లేకపోలేదు. రోజుకు రోజూ యీ భక్తుల నిజస్వరూపాలు బయటపడుతున్నాయి.

అంత ఆవేశంతో స్వామిని సాక్షిగా పెట్టి యీ పేద ప్రజల సేవ చేస్తానన్న డాక్టరు యిప్పుడు బాగా డబ్బు చేసుకుంటున్నాడు. ఈ స్వామిని సాక్షిని చేసిన రాజకీయ నాయకుడు మంత్రి అయ్యాడు. కొళాయి, మరుగుదొడ్లు కట్టిస్తానని నేనెప్పుడు మాటిచ్చానని దబాయిస్తున్నాడు. కొత్తగా పెళ్ళి చేసుకున్న జంటది నూతి ముందరి యిల్లే రోజూ ఆంజనేయులవారికి ఆనూతినీరే వాడుతున్నట్లు చూస్తోంది ఆ యిల్లాలు—అయినా ఆ నూతిలోనే పడి ఆత్మహత్య చేసుకుంది. ఏ కూతురికి పెళ్ళికావాలని మొక్కిందో ఆ కూతురు యెవరితోనో లేచిపోతే, ముఖం యెత్తలేక ఆ తల్లి వురిపోసుకుంది. ఇక దిన భత్యంకోసం మొక్కినవాళ్ళు దినదినాభివృద్ధి అబద్ధాలు, మోసంతో జెందుతున్నారు.

అంతే కాదు! ఒకనాడు మళ్ళీ ఆ నల్ల కారు వచ్చింది. అందులోనించి ఆవిడ దిగింది. ఈసారి బాలింతరాలు. చేతిలో పసికందుని పట్టుకుని దిగింది. స్వామివారి



ముందు "నీ చలవ" అని పడుకోబెట్టింది. వాడు కెప్పుమంటే రాజయ్య అటువేపు చూడనే లేదు.

ఆ రాత్రంతా నిద్రపోలేదు రాజయ్య. ఈ రాయి నిజంగా రాయే! ఇందులో ఏం మహత్యం లేదు. వుంటే నిజంగా బాధపడు తున్నవాళ్ళను ఆదుకోడా? ఏడాది కాలేదు ఆ డాక్టరు ఇప్పుడు కార్లో వస్తున్నాడు. ఆ మంత్రి విమానాల్లోనే తిరుగుతున్నాడు. ఈ దోపిడీదారుకి కొడుకు పుట్టాడు. ఇంకా మరో నాలుగు చేతులతో దోచడానికి! ఇతనిలో మహత్యంవుంటేయితనిని సాక్ష్యం పెట్టిఅతిక్రమించినవాళ్ళనుశిక్షించడూ? శిక్షించేబదులు వాళ్ళను వుద్ధరిస్తున్నాడు. ఇలాంటి స్వామికి తనెందుకు పూజారిగా వుండాలి? బ్రతుకు యెందుకూ పనికిరాకండా వ్యర్థంచేసుకోవాలి? అందుకే స్వామివారికి మళ్ళీ రంగు రాసి అలంకరించడం మానేశాడు. అతని కళ్ళల్లో యెరుపు కూడా తగ్గుతోంది. తను కట్టుకున్న పట్టు పంచెను వుతుక్కోలేదు. ఏదీ చేతకాని వానిలా వున్నాడు. తనచుట్టూ వున్నదేదీ తనను ఆకర్షించటం లేదు. కానీ స్వామి వారు రాను రాను ప్రజలను ఆకర్షిస్తున్నాడు. ఇతను ప్రత్యక్షదైవమన్న మాట యెలా ప్రాకిందో యిన్నాళ్ళూ ఆ మురికిపేట వాసులే వస్తున్న ఆ ఆంజనేయస్వామి గుడికి యిప్పుడు నిత్యం కార్లమీద వచ్చిన వాళ్ళు అధికమౌతున్నారు. వెండి తొడుగు చెయ్యిస్తామన్న వాళ్ళు. ఒక హుండీ యిక్కడ లేదా అని అడిగిన వాళ్ళు హెచ్చవుతున్నారు. కోరికండానే శనివారాలూ, మంగళవారాలు, భజన పార్టీలు డోలక్ మేళతాళాలతో వస్తున్నారు. ఏడాదిలో మైకు వచ్చింది. మండపం మొజాయిక్ అయిపోయింది. తూర్పు పక్క విఘ్నేశ్వరుని విగ్రహం ఒక దాత ప్రతిష్ఠించాడు. ఇంకో దాత ముందుగా దీపస్తంభం పెట్టించాడు. గుడికి ఖరీదైన యెమల్షన్ పెయింట్ ఒక భక్తుడు వెయ్యించాడు. ఎవరూ చెయ్యని పని యింకో భక్తుడు చేశాడు. కొళాయి నిము షాల మీద పెట్టించాడు. ఏడాదిసరికి - కొత్త అమావాస్య పోయాక-ఉత్సవం- ఒక రోజు కాదు రెండు రోజుల వుత్సవం జరిపించాలన్నారు. ఎలాగ డబ్బు కూడిందో యెవరికీ తెలీదు. ఆ మురికిపేటలోనే ఒక కమిటీ లేచింది. వాళ్ళంతా పెద్దరికం వహించితే చాలు—డబ్బు వేరేచోటునించి వస్తుంది.

రెండేళ్ళయేసరికి యీ గుడి పోల్చుకోలేనంతగా మారిపోయింది.

"దేముడికికూడా పక్షపాతమే."

"దేముడికి కూడా మనుషుల్లాంటి కోరికలే వున్నాయి. "దేముడూ లౌకికుడే—కాకపోతే యింతమంది దోపిడిగాళ్ళచేత. ఆ దోపిడి డబ్బుతో, యిన్ని హంగులు సమకూర్చుకుంటాడా?"

రాజయ్య యిలా అనుకుని "ఇలాంటి రాయిారవ్వకు కొలిచే బదులు యేదో మానవసేవ చేసుకుంటే మంచి" దనుకుంటున్న సమయంలో ఒక అమ్మాయి తారసపడింది. ముడుకుల వరకు లంగా, లంగామీదయెర్ర పువ్వుల జాకెట్టు వేసుకుని వుంది. పుష్టిగా వుంది. ఆ అమ్మాయిమీద కాదు దృష్టి— ఆ అమ్మాయి యెత్తుకున్న అబ్బాయిని చూడగానే, యెన్నాళ్ళకు తనను ఆకర్షించే దృశ్యం. అబ్బాయిది వుంగరాల జుత్తు. నవ్వితే నవరత్నాలు రాలుతున్నాయి. మెరిసి పడిపోతున్నాడు. అమ్మాయి మొక్కమంటే రెండు చిట్టిచేతులు జోడిస్తున్నాడు. తనకు షేకెండు యిచ్చాడు. ఏదీ కోరని భక్తుడు యిప్పటికి వీడొక్కడే. అందుకే ఆనవ్వులో అమృతం ఒలికిపోతోంది. ఆ కళ్ళల్లో దేముని ప్రతిబింబాలు కనిపిస్తున్నాయి. ఈ అబ్బాయి యెవడో ఆ తల్లి దండ్రులు తపస్సు చెయ్యగా పుట్టి వుంటాడు. ఎన్నో సత్కర్మల ఫలితం యిలాంటి అపురూపమైన సృష్టికి దారి తీస్తుంది. అబ్బాయి వెళ్ళిపోయినా కళ్ళ ఎదుటే మసలుతున్నాడు. రోజూ వస్తే బాగున్ను. కొద్ది క్షణాలైనా తన ముడుచుకుపోయిన హృదయం వికసించును. రెండు రోజుల తర్వాత మళ్ళీ వచ్చాడు. మళ్ళీ తనను మమకారంలో ముంచేశాడు. ఇలాంటి వాడు పుట్టాడంటే యిప్పటికైనా తను పెళ్ళి చేసుకోడానికి సిద్ధమే! ఏం స్వామీ? చేసుకోమంటావా? అన్నా— స్వామి అతని కంటికి స్వామిలా కనిపిస్తేగా! ఇంకా ఆ కొండవార ఎండకు ఎండి వానకు తడిసి పదుగురు యెక్కి తొక్కిన రాయే అది! అన్యాయంచేసిన వాళ్ళనే పైకెత్తుతున్నాడు. పేదరికంతో కృంగి అన్నమో అని ఆపద మొక్కులు మొక్కిన దురదృష్టవంతులను మరీ క్రుంగదీస్తున్నాడు. స్వామితో చెప్పుకునే బదులు ఆ అబ్బాయి—దేముని లాంటి నిష్కల్మషమైన మనసుతో వున్నాడు. వాడు ఒక యింట్లో పుట్టినా అందరి మనిషి. వాడు యెవరి బిడ్డ అని అడగటం తెలివితక్కువ


## జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

తెలుగు భాష మాత్రము చదవగలిగినవారు యితర రాష్ట్రములకు పోయి ఆ దేశములో స్థిరపడిన తరువాత వ్యాపారము గాని, విద్యా సంస్థలయందు గాని, ఉద్యోగ సంస్థలయందు గాని ఆ దేశ ప్రజలతో వ్యవహరించుటకు కష్టపడేవారికి, దినచర్యకు ఉపయోగించే వార్తలు చేర్చి, సులభంగా వ్యాకరణ లోపం లేకుండా వ్రాయడానికి, చదవడానికి మరియు ఆ దేశ ప్రజలతో తేలికగా వ్యవహరించుటకు, ఈ క్రింద వివరించబడిన ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. |
|---|---|
| ఆంగ్ల సంభాషణం-తెలుగు | 7-30 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | 9-00 |
| 30 రోజులలో మలయాళ భాష | 6-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | 6-50 |
| 30 రోజులలో హిందీ భాష | 6-00 |
| 30 రోజులలో కన్నడ భాష | 6-00 |
| 30 రోజులలో బెంగాళీ భాష | 4-50 |

| | వెల రూ. |
|---|---|
| 30 రోజులలో మరాఠీ భాష | 6-50 |
| 30 రోజులలో గుజరాతీ భాష | 5-50 |
| 30 రోజులలో ఒరియా భాష | |
| 30 రోజులలో ఉర్దూ భాష | 5-50 |
| 30 రోజులలో తమిళ భాష | 6-00 |
| 30 రోజులలో పంజాబి భాష | 6-00 |
| ఈజీవే టు స్పీక్ ఇంగ్లీష్ | 19-50 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014

తనం. ఈ బిడ్డ చూసిన వాళ్ళందరి హృదయాలను వెలిగిస్తున్నాడు. ఈ వేళ తనను "బాబా" అని పిలుస్తున్నాడు. రాజయ్య శరీరం ఒక్కసారి పులకరించింది చేతులు చాపగానే దగ్గరకు వచ్చేశాడు. వాడికోసం మంచి పండు, వాసన పువ్వు వుంచడం అలవాటైపోయింది. ప్రతిసారి మనస్ఫూర్తిగా దీవిస్తున్నాడు. "ఆయుః ఆరోగ్య ఐశ్వర్యాలతో కలకాలం బతుకు నాయనా!" అంటున్నాడు. తనకేదో పూజారిగా ఒక దివ్యత్వం సిద్ధించిందనుకుంటూనే దీవిస్తున్నాడు. తన వాక్కు బ్రహ్మవాక్కు అవుతుందన్న విశ్వాసం ప్రబలుతోంది. ఈ విశ్వాసం ప్రబలుతోన్నకొద్దీ యీ మురికిపేటలో పేదరికం యింకా అలానే వుంది. ఈ పేదరికమే వీళ్ళను ఈ రాతిని నమ్మించింది. ఈ పేదరికమే ఈ దేముడ్ని సాక్ష్యంపెట్టి మరీ అబద్ధాలను ఆడించింది. అంచేత వీళ్ళు ఏంచేసినా వీళ్ళ తప్పుకాదు. ఈ పేదరికం వీళ్ళమీద రుద్దిన వాళ్ళ తప్పు. ఆ తప్పు చేసిన వాళ్ళు మరిన్ని తప్పులుచేసి హాయిగా బ్రతుకుతున్నారు. ఈ రాయి యెగిరి వాళ్ళ నెత్తిమీద పడలేదు. తను యిక మేల్కోవాలి. అన్యాయాన్ని యీ ఆచార్య పీఠం నించే యెదుర్కోవాలి. ఆ పీడించే వారి అంతుచూడాలి."

ఇక కార్యసాధనకు పూనుకోవాలన్న సమయంలో ఆ అమ్మాయి రావటం మానేసింది. ఒక రోజు రెండు రోజులు వారం రోజులైనా కనపడలేదు. ఒక్కొక్క రోజు రాత్రుళ్ళు నిద్ర పట్టేది కాదు. ఎంచేత రాలేదు? ఏదో వూరెళ్ళారేమో? ఒంట్లో బాగులేదేమో ఆ "అబ్బాయికి ఏమీకాదు. నా దీవెనతో వాడు చిరంజీవి. వాడికేమైతే ఈ సరికి చుక్కలు రాలేవి. తోకచుక్క కనపడేది. పాడు కలలు వచ్చేవి" ఇలా ఆలోచనలతో పదిహేను రోజులైంది. ఈ పదిహేను రోజుల్లో సగం అయ్యాడు. ప్రతి నిముషం ఆ అబ్బాయి కళ్ళకు కట్టున్నాడు. ఎవరిని అడిగితే యెవరేం చెడువార్త చెపితే? రాత్రుళ్ళు గుడిలో నించి ఏదో స్వరాలు వినిపిస్తున్నట్లు ఏదో కదులుతున్నట్లు అనిపించి లేచి



చిత్రం
పోపూరి రమాదేవి, తిమ్మసముద్రం

చూస్తే యేమీలేదు. రంగు రాయకపోయినా విగ్రహం మాడు. ఎరుపు రంగుతో కనిపిస్తోంది. పువ్వులన్నీ ఎక్కడికక్కడ చిందర వందరగా పడినట్లు కనిపిస్తున్నాయి. కుంకుమ ఒలికిపోయినట్లు కొళాయిలో నీరు రానట్లు వుండి వుండి దీపాలు ఆరిపోయినట్లు—ఇవన్నీ తన వూహాలే!

ఆ అమ్మాయి ఒక రోజు గబగబ రోడ్డుకు అటువేపునించి వెళిపోతోంది. రాజయ్య చూసాడు. పిలవటానికి ఆ అమ్మాయి పేరైనా అడగలేదు. ఏవి అంటే యెవరు? గబగబ పరుగెత్తి రోడ్డుమీద ఆగే-

"గుడికి యెందుకు రావటం లేదు?"

ఆమె అలా మిటుకు మిటుకు చూస్తుంది గానీ జవాబు చెప్పదు.

"ఏం బాబా వంట్లో బాగులేదా?"

ఒక్కసారి వెక్కి వెక్కి యేడ్చేస్తోంది. అంతా అర్థమైపోయింది. ఆమె దుఃఖం కాస్త తగ్గాక అంది.

"ఒక్కరాత్రే విపరీతమైన జ్వరం. తలలో జబ్బట. తెల్లవారేసరికి పోయాడు బాబా! అమ్మగారు పిచ్చెక్కిపోయారు."

కాళ్ళు వణుకుతున్నా అమ్మాయి వెంట పడ్డాడు. అదే ఆ ఎర్రటి పట్టు పంచెతోనే బయలుదేరాడీ పూజారి! అతని పనితనంతో ఆ దేముడ్ని చెక్కిన శిల్పి. ఆ దేముడ్ని మనసులో తిట్టడం మొదలుపెట్టాడు "నీ ప్రతాపం అంతా అనాథులపైనే! చివరికి నీకింద యింత సేవ చేసిన నామీద కూడా నీ అక్కసు చూపించావు— దేముడు శిష్టరక్షణ దుష్టశిక్షణ చేస్తాడని మనుషుల నమ్మకం! నివ్వేం దేముడవు?"

అలా వెళ్ళేసరికి బ్రహ్మాండమైన తోట. ఆ అందమైన తోట మధ్య అపురూపమైన పాలరాతి యిల్లు. ఆ నల్లటి ఫారన్ కారు పోర్టికోలో నిల్చుని వుంది. గేటుదగ్గరే ఆగిపోయి.

"బాబా వీళ్ళ అబ్బాయా?"

"అవును, లేక లేక ఆంజనేయస్వాముల వారికి మొక్కితే పుట్టాడట. బాబా పుట్టకపోయినా బాగున్ను. అమ్మగారు పిచ్చిది కాకపోను...."

అమ్మాయి యింకేదో అంటున్నా వినకుండా గబగబా అంజనేయస్వామి ఆలయం దగ్గరకు పరుగెత్తాడు. ఇప్పుడు ఆ విగ్రహం తను చెక్కిన రాయి కాదు. ఎవరికివ్వవలసిన న్యాయం వాళ్ళకు ప్రసాదించే దేవుని నీడ.

తొలిసారి తలపంచగా కరుణరసం పొంగి ఆదేపనిగా ఆ అబ్బాయిని తలచుకుంటూ "దురదృష్టం పేదవాళ్ళకే కాదు—అందరి దీనూ" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.


కార్తికమాసం—శివపూజ

(పూజా కుసుమాలు — మూడవ భాగం)

కార్తికమాస వ్రతం- కార్తిక స్నానం- కార్తిక దీపం- సోమవారం- ఇతర ముఖ్య తిథులు- ఈ సందర్భాలలో ఏమి చేయాలి? ఏమి చెప్పుకోవాలి? అన్ని కులాల స్త్రీ పురుషులు స్వయంగా ఆచరించదగిన పూజావిధానము. పురుషసూక్త విధానంలో వేదోక్త పూజాక్రమము పురాణోక్త పూజాక్రమము- సంక్షిప్త రుద్రాభిషేకం. సుప్రసిద్ధ దివ్యస్తోత్రములు, కార్తికమాసం గురించి అనేక వివరములుగల సమగ్ర పూజాగ్రంథము. పుస్తకం వెల రు. 3/- తపాలా ఖర్చులు అదనం. 20 కాపీలకు మించిన ఆర్డరుకు 25% కమీషను.

ప్రవీణ్ పబ్లిషింగ్ హౌస్,

7-9-23, సాంబమూర్తి వీధి, రామారావుపేట, కాకినాడ—533 004.